

ఊళ్ళో అన్నిషాపులకు బుధవారం సెలవంటే కొండ్రావు సైకిలుషాపుకు మాత్రం శుక్రవారం సెలవు. షాపు అని పెద్ద అట్టహాసం ఏముంది? అద్దెకివ్వడానికి అరడజను పాత సైకిళ్ళు, మరమ్మతు చేసే పనిముట్లు—అంతే.

అలవాటు ప్రకారం గురువారంనాడు రాత్రి సినిమాకు వెళ్ళాడు కొండ్రావు. ఉదయం వేగం లేవకపోయినా బాధలేదు అన్నమాట జ్ఞాపకం చేసుకొని మరీ పడుకున్నాడు. కాని అదేం కర్మమో సెలవురోజున మామూలు రోజుకంటే ముందే మెలకువ వచ్చేస్తుంది.

ఉదయం ఏడుగంటలకల్లా కాలకృత్యాలు పూర్తి చేసుకుని, కాఫీ కాచుకొని తాగడంకూడా సమాప్తమయింది. రోజూ అయితే తాను ఉదయం షాపుకు వెళ్ళిపోయిన తర్వాతగాని పేపరు రాదు. సాయంకాలం ఇంటికి వచ్చాక వండుకొని, భోజనంచేసి, పేపరు అలాఅలా తిరగవేస్తూంటే నిద్రవచ్చేస్తుంది.

ఈరోజు ఓపికగా చదువవచ్చునని తీరికగా పడక కుర్చీలో కూర్చుని చదవబోతే చదవాలనే ఉండదు. ఈ పేపరు వాళ్ళకురోజూ ఇన్ని వింతలు, విశేషాలు ఎలా వస్తున్నాయో? తనవంటి వాడి జీవితంలో మాత్రం ఎప్పుడూ, ఏవిశేషాలూ ఉండవు. బాగా ఓవర్‌హాల్‌చేసిన సైకిలులాగ తన బ్రతుకు సాగిపోతూంది. ఇలాగే ఇంకెన్నాళ్ళు సాగవలసి ఉందో? తనసుగూర్చి ఎవ్వరికీ అక్కర్లేదు. ఎక్కువో తక్కువో ఎన్నో కొన్నిడబ్బులు రాకపోవు ప్రతిరోజూ. కాస్త డబ్బు మిగిలితే మరొక సైకిలు కొంటాడు— అంతే.

బోరుగా ఉంది పేపరు చూడ్డానికి. మళ్ళీ వారం రోజులదాకా కుదరదు. ఈరోజే పెరట్లోని పువ్వుల మొక్కల సంరక్షణ సంగతి చూడాలి. ఎండ ఎక్కువయితే పనికాదు. ఈ పువ్వుల మొక్కలుకూడా తనవంటివే. ఎప్పుడో తమ చిత్తంవచ్చి నప్పుడు పూలుపూస్తాయి. పూచినా తాను తప్ప వాటినిచూసి ఆనందించే వాళ్ళులేరు.

ప్రతి ఋతువులోనూ ఏవో కొన్ని పువ్వులు పూస్తూనే ఉంటాయి. ఒకేరకంగా కనిపించే మట్టిలోంచే వేరువేరు రకాలుగా సారాన్ని తీసుకొని, ఎన్ని వింత వింతల రంగుల పువ్వులను పూస్తున్నాయి మొక్కలు. అంతటితో వాటి జన్మ సార్థకమయిపోతుంది. మరి తన బ్రతుకు? ఏదో ఒకరిమీద ఆధారపడ వక్కరలేకుండా బ్రతుకు బండి సాగిపోతూంది. అయితే ఎన్నాళ్ళిలాగ?

ఇప్పటికిప్పుడే తానీవృత్తిలో స్థిరపడి సుమారు పన్నెండేళ్ళయింది. అప్పటికి తనకు పదహారేళ్ళు. తాను చెయ్యని పొరపాటుకు శేషాచలం గారిచేత బయటికి వెళ్ళగొట్టబడి ఆకలితో మాడుతూ నాలుగురోజుల్లు తిరిగి, ఎక్కడా ఆశ్రయం దొరకక, ఆనాటి రాత్రిలోపున ఏదయినా ఆహారం దొరికితే మంచిదే — అంతేకాని

ముష్టెత్తుక్కోడంతనవల్లకాదు, లేకుంటే రాత్రి ఏదోవిధంగాజీవితం ముగించాలని నిశ్చయించుకొన్న తనకు సుబ్బారావు సైకిలు షాపులో పని దొరికింది. ''ముందు కొన్నాళ్లు పనినేర్చుకో, తిండికీ బట్టకీ గాధలేదు. జీతంమాట తరువాత చూద్దాం '' అన్నాడాయన.

ఆయనే ఆర్నెల్లు గడిచాక ''ఒరే కొండా! ఇన్నాళ్లాయి చూస్తున్నాను— ఎప్పటికయినా జీతం అడుగుతావేమోనని. నీకు జీతం అసలే అక్కర్లేదుట్రా? టిఫినుకయినా నేనిస్తేనే తప్ప డబ్బులడగవు. సినిమాకి కూడా నాతో రమ్మంటే తప్ప నీ అంతట నువ్వు వెళ్తావవు. ఇలా ఎన్నాళ్లు పని చెయ్యాలనుకొంటున్నావురా?'' అని అడిగాడు.

ఇటీవల జరిగిన సంగతులూ, సాగిన సంభాషణలూ సరిగా జ్ఞాపకం లేవుగాని, అప్పటివన్నీ మనసుమీద ముద్రపడి ఉన్నాయి.

''మీరుండనిచ్చి వన్నాళ్లుంటాను. బ్రతుకు మీద ఆశ వదులుకున్న వాడికి ఆధారం కల్పించి పని నేర్పారు. ఇప్పుడు మరి బలవంతంగా చచ్చిపోయే అగత్యం లేదు. ఎక్కడయినా పనిచేసుకొని బ్రతకగలననే ధైర్యం వచ్చింది.''

''అంటే ఏమిట్రా, నిన్ను నేను పొమ్మన్నట్టు మాట్లాడుతున్నావు?''

''అదేం లేదండి. ఈ మధ్యను మీ ఆరోగ్యం బాగుండడం లేదు. అందుచేత షాపు మూసెయ్యాలనుకొంటే.....''

''సరిగా రెణ్ణెల్లకిందట అలాగే అనుకొన్నా మరా, కొండా. కాని, నిన్ను నమ్మినందుకల్ల నేనేం నష్టపోవడంలేదు. ఏరోజు డబ్బులు ఆరోజు కచ్చితంగా తెచ్చి ఇస్తున్నావు. కొండా, ఇదంతా వట్టి దండగనుకోకు.''

• • •

''కొండా! కొండా!''

''ఏమండి బాబుగారూ! డాక్టరుగార్ని పిల్చేదా?''

''మరి డాక్టరు చెయ్యగలిగిందేం లేదురా. నాచేతిమీదుగా వేలకివేలు తగలేశాను. కొనకి ఎలాగో ముష్టెత్తుక్కోకుండా ఈమాత్రం నిలబడ గలిగేను. ఈ ఏడాదిన్నరలోనూ నా జబ్బు కింద చాలా ఖర్చయిపోయింది. నేను కోలుకుంటే ఇద్దరం కలిసి పనిచేసి, నాలుగు డబ్బులు చేసుకొని నిన్నొక యింటివాణ్ణి చెయ్యాలనుకొన్నాను. కాని, చిన్నప్పటినుండి నా ఆశలన్నీ ఇలాగే అయిపోయాయి. బాగా డబ్బున్న రోజుల్లో ఇంకా ఎక్కువ డబ్బు కష్టపడకుండా ఆర్జించాలన్న వెర్రి ఆశతో ఉన్నదంతా సుమారుగా పోగొట్టుకొన్నాను. కాని, ఇప్పుడు వెనక్కి చూసుకుంటే నీలాటివాడికి ఒకడికి కాస్త ఆధారం కల్పించావన్నది తప్ప నాకు మరేతృప్తీ లేదు. నీకు సరిపడిన పిల్లనుచూసి పెళ్లి చెయ్యాలనుకొన్నాను. ఆ సంతోషం మరి నాకు దక్కనివ్వలేదు భగవంతుడు!''

''ఇప్పుడు నాపెళ్లికేం తొందర వచ్చిందిలెండి?''

మాట జారితే కష్టం కాని కాలు జారితే వెనక్కి తీసుకొనవచ్చు అంటారు. తప్పటడుగు వేసిన సంగతి తెలుసుకొనేపాటి నిజాయితీ; తమ తప్పులకు, తల్పులితంగా సంభవించే పరిణామాలకు మరొకరిని బాధ్యులను చేయరాదన్న వివేకమూ; అడుగడుగునా ఎదురయ్యే అవాంతరాలకు తట్టుకొనే ఆత్మస్థైర్యమూ; అన్నిటినీ మించి హృదయమూ ఉన్న వ్యక్తికి మార్గం కనుపించకపోదు.

''అలా అనకు. ఏ వయసులో జరుగవలసినది ఆ వయసులో జరగాలి. నాకు మిగిలినవి ఈ చిన్న ఇల్లు, ఆ షాపు. ఇన్నాళ్లూ ఎప్పుడయినా ప్రాణంమీదికి వచ్చినప్పుడు పనికివస్తాయని దాచేను బేంకులో, అయిదువేల రూపాయలు. నిన్నను ప్లీడరుగారిని పిలిపించి, ఆయనా, డాక్టరుగారూ ఉండగా నేను పెట్టవలసిన సంతకాలన్నీ పెట్టేశాను. ఇదంతా నీదే. ఇంతకి ఎన్నేళ్లొచ్చా డబ్బుతో స్వతంత్రంగా బ్రతుకు ఆరంభించి, చివరికి నువ్వు తప్ప 'నా' నే వాళ్లెవళ్లూ లేకుండా ఇలా అయిపోయాను. నువ్వయినా సుఖపడు. మరొక్కమాట నా అనుభవంమీద చెప్తున్నాను. ఎక్కువ డబ్బున్న రోజుల్లో ఆశ, హడావిడి, గాభరా, భయం ఇవే తప్ప నిజంగా సుఖపడలేకపోయాను. అంతకంటే కాయకష్టంచేసి నిత్యకృత్యం గడుపుకొనే రోజుల్లోనే మనసుకి శాంతిగా ఉండేది. అయితే ఒంటరి జీవితంలో సుఖంలేదు. నేను పొందలేని సుఖాన్ని నువ్వయినా పొందగలవనే నా ఆశ. అబ్బ, గుండెల్లో మంట— ఏదీ ఆ మందిలా ఇయ్యి. ఊహూ, మరి మందులేం చేస్తాయి? నేను చెప్పింది జ్ఞాపకం ఉందికదూ? ఎందుకంటే రోజూరోజుకీ చూస్తున్నావుకదూ, ఈమాత్రం మాట్లాడ్డంకూడా.... ఇంతకీ నేనేంచెప్పేను?... నర్లే ఒకళ్లు చెప్పిందాన్లో ఏముంది? ఎవడి బ్రతుకు వాడు బ్రతకవలసిందే. ఎవడి బాధ వాడు అనుభవించవలసిందే— ఎందుకేడుస్తావురా ఓరి వెర్రి నాగమ్మా.....''

• • •

గతకాలపు సంగతులు నెమరువేసుకుంటూ పూలమొక్కల మాటే మరిచి పోయి, అలా పడక కుర్చీలో వెనక్కి చేరగిలబడి సగం కళ్లు మూసుకొని ఉన్న కొండ్రలావు ఉలిక్కిపడ్డాడు దగ్గరలో వినిపించిన పిలుపువిని.

''కొండా!''

''ఎవరు?''

''ఓరి! నన్నే పోల్చలేకపోయావుట్రా! నేను గోపిగాణ్ణి.''

''గోపాలమా? ఎన్నాళ్లకి! ఇప్పుడెక్కడ ఉంటున్నావు? ఏం చేస్తున్నావు?''

''అదంతా తరవాత చెప్తాముగాని, నీబన కమక్కొండికి చచ్చినంత పనయిందనుకో.''

''అంటే, కావాలని, వెతుక్కొని, నాకోసమే వచ్చావన్నమాట?''

''నేను రావడం నీకిష్టం లేనట్టుంది. అలా అయితే చెప్పు. పోతాను.''

''నాలాటివాడితో నీకు పనిపడిందంటే ఆశ్చర్యంగా ఉంది. అంతేకాని.....''

''ఏమోన్లే. అప్పుడు నామూలంగా అన్యాయంగా మాపెదనాన్న నిన్నింట్లోంచి తరిమేశాడు.''

''అప్పటి గొడవ ఇప్పుడెందుకులే.''

''నాకు తెలుసు. నీ మనసులో ఎటువంటి కోపం ఉంచుకోవనీ, అవసరానికి ఆదుకొంటావనీను—''

''నీ మాటలు నాకేం అర్థం కావడంలేదు.''

''డబ్బేం ఇవ్వక్కర్లేదులే.''

''ఇవ్వాలన్నా నా దగ్గరేముంటుంది? రెక్కాడితే డొక్కాడుతుంది. అంతే.''

''ఒకవిధంగా నీవనే మా అందరికం టేనయం. దానికేంగాని, ఒక్క పదిపదిహేను రోజులపాటు తలదాచుకొందుకి ఆశ్రయం ఇవ్వాలి.''

''ఓస్ అంతేనా? అయితే ఫర్వాలేదు. పదిహేను రోజులు కాదంటే నెల్లాళ్లుండు.''

''నాకు తెలుసును నువ్వు తప్పకుండా అవసరానికి ఆదుకొంటావని. ఇప్పుడే ఒక అరగంటలో వస్తాను. స్టేషన్లో సామాను అవీ ఉండిపోయాయి.''

''నాకు ఈరోజు పనిలేదు. రమ్మంటే వస్తాను.''

''ఎందుకులే నీకు శ్రమ? మేము సామాను రిక్షాలో వేసుకొని వస్తాము.''

• • •

''శకూ,ఇకను ఆమాటుఅక్కర్లేదు.మేమిక్కడ మాట్లాడుతూ ఉంటాము. నువ్వు పెరట్లోకి వెళ్లి నీ చీర కట్టేసుకో. ఇదుగో సంచి. ఏమిట్రా, అంతలా ఆశ్చర్యపోయి చూస్తున్నావు?''

''ఆశ్చర్యమో! అయోమయమో! స్టేషనుకి వెళ్లి సామాను తెస్తానన్నవాడివి!''

''ప్రస్తుతానికి నాసామాను ఈ మూటుకేను, ఆ సంచి, అన్నిటికంటె ముఖ్యం శకుంతలాను—''

''ఇక్కడ ఉండేది బ్రహ్మచారిగాణ్ణి నేనొక్కణ్ణే. ఆడవాళ్లుండడానికి తగిన సదుపాయాలు....''

''అవేమీ లేకపోయినా బాధలేదు. శకూ మనకంటే సులభంగా సర్దుబాటయి పోగలదులే. నువ్వేం గాభరా పడకుండా మామూలుగా ఉండు. నేనూ మరెక్కడయినా ప్రయత్నిస్తానులే. అంతా నవ్యంగా జరిగితే నాలుగయిదు రోజుల్లో మకాము ఎత్తిపెట్టేస్తాను. ఎవరిదారి వారిది.

పంతుల శ్రీరామశాస్త్రి

ఉజ్వల భవిష్యత్తుకు వరప్రసాదం

ఇంటెలిజెన్సు టెస్టు & ఎస్. ఎస్. బోర్డు ఇంటర్వ్యూస్ గైడ్

ఇందు దిగువ విషయములు ఉన్నవి :

సర్విసెస్ సెలెక్షన్ బోర్డుచే సెలెక్షనుకు, గ్రూప్ పరీక్ష లేక గ్రూప్ చర్చలకు, టెలిఫోన్ మీద తెలివితేటల పరీక్షకు చిట్కాలు, టీమ్ స్పిరిట్, సైకియాట్రిస్టు రౌండ్, బ్రాన్ టాక్‌లు, బొమ్మతోపాటు ఒక భాగ్యు లెక్కల టెస్టు పేపర్లు, సైన్సు, ఆర్ట్సు, వాఙ్మయం, మర్యాద, జాగ్రఫీ చమత్కార ప్రశ్నావళి. విజయ మార్గమునకు జ్యోతి. రివైజుచేయబడిన 6 వ ముద్రణము. వెల రు. 10/—. పోస్టేజి రు. 2/—.

GEMINI BOOKS TRADERS (A.P.W.)
L.B.MKt-P. Box 1607, DELHI-6.

నగంతన్నా తక్కువ ధర

హోం సినిమా రు. 15 లకు తెప్పించుకొనండి




ప్రపంచంలో మిక్కిలి అద్భుతమైన గృహ కాలక్షేపం. వరి కొత్తగా కనిపెట్టబడింది. మీ అభిమాన ఫిలిం తారలను అద్భుత సన్నివేశాలలో, భయానకఘట్టాలలో, ప్రేమకలాపాలలో, నృత్యంలో, హాస్యకృత్యాలలో, సాహసచర్యలలో మీఇంట్లోనే మీ మిత్రులతో, కుటుంబంతో చూచి ఆనందించండి. చిత్రాలు వాస్తవికంగా, చైతన్యంగా సినిమా తెరమీద చూచినట్లే కనిపిస్తూ మిమ్ము ఆశ్చర్యపరిచి ప్రేక్షకులను ఆకర్షించగలవు. హోం సినిమా వెల రు. 15/—లు. ఒక ఉచితపు ఫిలిం రీలుతోసహా ఉపయోగించటానికి సర్వసంసిద్ధపరచబడింది. వివిధ విషయాలమీద అదనపు ఫిలింరీళ్ళు ఒకొక్కటి రు. 5/—లు. ఇండియాలో మా వద్ద మాత్రమే లభించును. సప్లయిలు పరిమితంగా ఉన్నవి. పోస్టేజి రు. 2/50. పెద్ద గిరాకీ. ఇప్పుడు ఏమీ డబ్బు పంపవద్దు. పోస్టుమన్‌కు మీ ఇంటివద్ద వెంటనే డెలివరీ చేసినప్పుడు చెల్లించండి. త్వరపడండి! మీ ఆర్డరును నేడే పంపండి.

AMERICAN SUPPLIES STORE,
A.P. Chitli Kabar, DELHI-6.

# కొండలరావు

నీకష్టం మాత్రం వృథా పోనివ్వనులే.''

''నాకష్టం మాటకేంగాని, నేననేది అవిడికి ఇక్కడ.....''

''ఏ వసుపాయాలూ సౌకర్యాలూ లేకపోయినా బాధలేదు— సరదాగా సర్దుకుపోగలదు. మనకన్న తక్కామొక్కీలు తిన్నరకం. మరిచిపోయేను, చాలా ముఖ్యమయిన పని ఒకటి ఉంది. ఇంతసేపూ ఈ టసని గురించిన వేటతోనే అయిపోయింది. మరి ఇప్పుడు టైములేదు. వస్తాను, తరవాత మాట్లాడుకొందాము.''

• • •

''వీడు, గోపాలం, ఇంకా రాలేదెంచేతనో?''

''అతడు రాలేదని మీకెందుకంత గాభరా?''

''ఉదయం అనగా వెళ్లిపోయేడు మిమ్మల్నిక్కడ విడిచిపెట్టి. మీకేంకావాలో ఏమిటో ఏమీ చూడకుండా.....''

''నాకేం కావాలి? మీరు మధ్యాహ్నం భోజనం హోటలునుండి తెచ్చారు. కాని ఈపూటమాత్రం ఏమీ తేకండి—దండగ. ఇంట్లో అన్నీ ఉన్నట్టున్నాయి.''

''మీరు వంటచేస్తారా?''

''ఏం తప్పా? అదీ చేతకాదనా? అంత సుకుమారంగా పెరగలేదులెండి.''

''కాని.........''

''వాకులేని మొగమాటం మీకెందుకు? హాయిగా ఇక్కడ పడక కుర్చీవేసుకుని, ఆకాశంలోని మేఘాలనీ, మీరు కష్టపడి పెంచుకొన్న పువ్వుల మొక్కల్నీ చూస్తూ కూర్చోండి. వంటచేసి పిలుస్తాను.''

''ఈ ఒక్కపూటకీ మీకెందుకు శ్రమ? హోటలునుండి తెస్తాను. రాత్రి వాడువచ్చాక రేపటిమాట ఆలోచిద్దాము.''

''మీకుగాని, హోటల్లోనో, లేక మీచేతో మీరు వండుకుంటేనో తప్ప తినకూడదనే నియమం ఉంటే చెప్పండి. అలా అయితే, నాకీపూట ఏమీ అక్కర్లేదు. మీరు మీ అలవాటు ప్రకారం వంటచేసుకొని భోజనంచెయ్యండి.''

''నా ఉద్దేశ్యం అది కాదండీ. ఏదో అవసరం నిమిత్తం నాల్రోజులు ఉండేవాళ్లకి మీకెందుకు శ్రమ అని.''

''నాల్రోజులే ఉంటామో, నాలుగు గడియల్లో వెళ్లిపోతామో, లేక నాలుగు నెలలయినా కదలమో ఎవరికి తెలుసును? అయినా ఏమిటో ఈ గోపాలం తిన్నటివాడు కాడు. ఎవళ్ల గొడవలు వాళ్ళు పడకుండా మధ్యన మీలాటివాళ్లకి కూడా...''

''ఇందులో పెద్ద ఇబ్బందేముంది లెండి? చిన్నప్పుడు వాళ్ల పెద్దనాన్నగారు దిక్కులేని వాణ్ణి నన్ను చేరదీసి, పెంచి, పెద్దవాణ్ణిచేసేరు.''

''ఆయన పెంచి పెద్దచేస్తే ఈయనగారు తనుచేసిన తప్పు మీమీదవేసి తను తప్పుకున్నాడు. అయినా, ఆ అమ్మాయికెంత బుద్ధిలేకపోయిందో, అన్యాయంగా మీకు శిక్ష పడుతూంటే మాట్లాడకుండా ఊరుకుంది.''

''మీకంతా నాగురించి తెలిసినట్టే ఉంది. తప్పు ఎవరిదయితేనేం, అప్పటికాగండం గడిచిపోతే వాడయినా బాగా చదువుకొని పెద్దవాడవుతాడనుకొన్నాను. అసలు ఇంతకీ వీడిప్పుడేం ఉద్యోగం చేస్తున్నాడో, ఎక్కడ ఉంటున్నాడో ఆ వివరాలేమీ చెప్పలేదు. అసలు మాట ఆడగడానికి సందిస్తేకదూ, వాడి హడావిడి, వాడి గొడవ—అంతే— చిన్నప్పుడూ సరిగా ఇంతే.''

''అన్నీ వివరంగా విశదంగా కనుక్కోండి అతను మళ్లీగాని వస్తే.....''

''ఏమిటలా అంటున్నారు? ఎందుకురాడు?''

''రాకేం? ఇప్పటికింకా రావలసిన అవసరం ఉందిలెండి. కాని.....''

''ఏమిటి?''

''అతన్ని మీరు ఏ ప్రశ్నలూ అడక్కపోవడమే మంచిది. నిజం చెప్పని వాళ్లను ప్రశ్నలడగడం మరిన్ని అబద్ధాలు ఆడించడమే అవుతుంది.''

''అలా అయితే, ఏమీ అడగను. నాకు అవకాశం ఉన్నంతకాలం బాధలేదు. కాని....ఏంలేదు.''

''నా సంగతి అడగాలనుకొనేనా మానేశారు?''

''మీకు మనసులోని మాటలు తెలుసుకోవడం చాలా సులభంగా ఉన్నట్టుంది.''

''ఏం తెలిసినా, ఎన్ని మంచి ఆశలు ఉన్నా, ఏం లాభం? నాకర్మ అనండి, మరేమనండి, ఎక్కడికక్కడ సర్దుకొని ఇకనైనా నవ్యంగా బతుకుదామనుకొంటే బతకనియ్యకుండా తిప్పుతూంది. ఇదొక విషవలయం. ఎప్పుడెలా అంతమవుతుందో ఈ బతుకు. నాకు మతిపోతూంది. ఏమిటంటున్నానో! ఏమయినా మా గురించి మీకు ఆట్టే తెలియకుండానే మేమిక్కడనుండి వెళ్లిపోవడం మాకూ, మీకూ కూడా మంచిది.''

''ఏమిటో అంతా చిత్రంగా ఉంది.''

''ఇందులో పెద్ద విచిత్రమేం లేదుగాని, ఆకాశంమీద మబ్బులు చూడండి—చాలా చిత్రవిచిత్రంగా ఉన్నాయి. అవి మనస్సుని బాధకలిగించవు. ఒక్క గంటలో వంటయిపోతుంది. నాకు ఎక్కడేమి ఉన్నాయో తెలియకపోతే అడుగుతూ ఉంటాను.''

''కూర ఏమీ లేదు కాబోలు!''

''బంగాళాదుంప లున్నాయి. అది వేపుడు చేస్తాను. పప్పు పులుసు చేస్తాను. ఇంకా కావాలంటే......''

''అక్కడికదే విందు భోజనం.''

• • •

''లేచారా? కాఫీ రెడీసార్.''

''ఏమిటి? ఎవరు?''

''ఇంకా మీకు నిద్రమత్తు పోలేనట్టుంది.

అందుకే ఒక కప్పు కాఫీ తాగితే....''

''అబ్బ! ఆరున్నర దాటింది. ఈపరికి రోజూ స్నానం ముగించుకొని, కాఫీ తాగుతూ ఉండే వాణ్ణి.''

''కాఫీ రెడీగా ఉంది.''

''కాని, నేను రెడీగాలేను. వేగం తెముల్చి వస్తాను.''

''మీకు బెడ్ కాఫీ తాగే దురభ్యాసం లేదన్న మాట?''

''కావాలన్నా ఇచ్చే వారెవరు?''

''ఈరోజు నేనిస్తానంటున్నా వద్దంటు న్నారు.''

''ఎందుకులెండి. అలవాటుగా జరిగే పద్ధతే మేలు.''

• • •

''నిన్నరాత్రి రెండో ఆట సినిమాకుపోయి, తరువాత వచ్చి వీధి అరుగుమీద పడుకోవా లనుకొన్నాను. మీరు భోంచేసేక, మీతో చెప్పి వెళ్లాలని, ఆలోగా ఒక్క గడియ విశ్రమిద్దా మనుకొంటే అలాగే నిద్ర పట్టేసింది. మళ్లీ ఇప్పటిదాకా తెలివి రాలేదు.''

''పసిపిల్లల్లాగ అంత నిర్విచారంగా నిద్ర అందరికీ రమ్మంటే వస్తుందా?''

''నిద్రకేం భాగ్యం! కాని, పాపం, వేరే మరొక మంచం కాదు, పరుపయినా ఈయింట్లోలేదు. మీరెక్కడ పడుకున్నారో? అసలు నిద్ర పట్టిందో లేదో?''

''అన్నీ ఉన్నప్పుడు పట్టని నిద్ర నిన్నరాత్రి మీ పెరటి వరండాలో చీర తలకింద పెట్టుకొని పడుకొంటే బ్రహ్మాండంగా వచ్చింది. తెల్ల వారుతూఉండగా పక్కల అరుపులు వినిపిస్తేనే గాని మెలకువ రాలేదు.''

''పోనిండి. నా పొరపాటు ఏమయినా మీకు నిద్రపట్టింది. ఈ రాత్రికి బాధలేదు. నేను వీధి అరుగుమీద పడుకొంటాను.''

''రాత్రి సంగతి ఇప్పుడెందుకు లెండి. మీరు ఎక్కడికో వెళ్లడానికి తొందరపడుతున్న ట్టున్నారు.''

''వెళ్లాలి. నిన్నసంటే దుకాణానికి సెలవు. ఇక్కడ ఈ గూట్లో డబ్బులుంటాయి. ఏమయినా కావలిస్తే పొరుగువాళ్ల పని కుర్రవాడు—సింహా చలం—నేను చెప్పేసంటే తెచ్చిపెడతాడు.''

''మీరెన్ని గంటలకి భోజనానికి వస్తారు?''

''నేనా? ఎందుకులెండి. అక్కడ దుకాణానికి హోటలు దగ్గరే. సాయంకాలం కూడా......''

''భోంచేసి వస్తానంటారా?''

''అదే మంచిదనుకొంటున్నాను.''

''బాగుంది.మీయింట్లో మీకుమొగమాటం ఏమిటండీ? మధ్యాహ్నం రావడానికి దూర మయితే మీ యిష్టం. కాని, రాత్రి ఇంట్లో భోంచెయ్యడానికేం?''

''అలాగే—మీయిష్టమే. కాని, వీడు గోపా లం గాని వస్తే, నన్ను షాపు దగ్గర కలును కోమని చెప్పండి.''

''వస్తే చెప్పడానికేం? తప్పకుండా చెప్తాము, నామాట వినిపించుకోవాలి గాని. మీకు ఆలస్యం అవుతున్నట్టుంది.''

''అంత ప్రమాదమేం లేదు. స్వంత నౌకరీ కద. మరేం గాభరా పడకండి. వీడు వచ్చేక నేను అంతా కుమక్కొంటాను.''

''నాకేం భయంలేదు. మీయింటికే భయం లేదు. కాపుంటాను.''

• • •

''గోపాలం! ఇప్పటికి సుమారు నెల్లాళ్లయింది. నీతో సరిగా మాట్లాడదామంటే వీలే చిక్కడం లేదు.''

''మరేం మాట్లాడక్కర్లేదు. ఇదు, వంద రూపాయలు.''

''బాగానే ఉంది. నేను.....''

''ఏం తక్కువయిందా? అయితే మరొక పాతిక తీసుకో. ఎంత మహా! ఒక్కరాత్రి ఆటలో పోయినంత.''

''నీ దర్శాకి చాలా ధన్యవాదాలు. కాని, ఒక్క రెండు నిమిషాలు నేను చెప్పేది వినిపించుకో గలవా?''

''ఏమిటి నువ్వు చెప్పేది? నీతిపాఠమేకదూ?''

''ఒకళ్లకి నీతులు చెప్పేంత వాణ్ణని నన్ను నేను అనుకోవడం లేదుగాని, ఎటువంటి చూసినా చెప్పవలసిన పూచీ ఉందిగనుక చెప్పక తప్పదు. అంతా విని, తరవాత నీ యిష్టం ఎలాగుంటే అలాచెయ్యి. మధ్యలో అడ్డుతగలకు. మీరు వచ్చి సుమారు నెల్లాళ్లయింది. మొదటి నాలుగయిదు రోజులు నాకు నీ దర్శనమే లేదు. తరవాత రాత్రులు నీస్నేహితులతో కలిసి వస్తున్నావు. రాత్రంతా పేకాట ఆడి తెల్లవారుతూండగా వెళ్లిపోతున్నారు. నువ్విక్కడ పడుకొన్న రోజుల్లో కూడా ఒంటిమీద స్పృహలేకుండానే ఉంటు న్నావు. నేను వీధి అరుగుమీదా, ఆ అమ్మాయి వంటగదిలోనూ పడుకొంటున్నాము.''

''కావాలంటే ఇద్దరూ కలిసి గదిలోనే పడు కోండి. మాకా పెరటి వరండా చాలు.''

''ఛ! ఏమి మాటన్నావు?''

''అదేం మహా పతివ్రత కాదులే. నేనెలాటి వాణ్ణో నువ్వూ అలాటివాడివే.''

''నన్ను నామాట పూర్తిగా చెప్పనిచ్చేవు కావు. నువ్వు, నీస్నేహితులు మీగొడవలేవో మీరు పడండి. కాని, ఈ ఇంట్లో ఇకముందు...''

''పేకాట జరగడానికి వీల్లేదంటావు. సరే, నీకర్మం. రోజంతా ఒళ్లు హూనమయ్యేలా పనిచేసి నాలుగయిదు రూపాయలు సంపాదించ లేవు. పేకష్టం పడకుండా రోజుకి అయిదు రూపాయలిప్పిస్తాను. నాదేపూచీ.''

''ఇలాగని ముందే తెలిసి ఉంటే....ఇప్పడయితే మాత్రం—నాకు మీ డబ్బువద్దు, పాడువద్దు. ఇప్పుడే, ఈక్షణమే, ఎలా వచ్చావో అలాగే...''

''కొండా! కొండా! నిజంగా కోపం వచ్చిం

**వెలకు రు. 400/- సంపాదించండి**

350 జపాన్ పరిశ్రమల గైడ్ రు. 12-8 0 బొమ్మలతో ట్రాన్సిస్టర్ రేడియో గైడ్ రు. 4-, ఫొటోగ్రఫీ రు. 3/ . టైలరింగ్ అండ్ కట్టింగ్ గైడ్ రు. 4/-, ఎలెక్ట్రిక్ అండ్ రేడియో గైడ్ రు. 8-8-0, వివాహజీవితం రు. 100 బొమ్మలతో- రు. 5/-. పోస్టేజి ప్రతి పుస్తకానికి రు. 1 4-0 అదనం.

**VANDANA BOOK DEPT (ATG)**
**RAFATGANJ, ALIGARH (U.P.)**

**దగ్గు నివారిణి** తిరగపెట్టకుండా దగ్గును యిప్పుడే నిర్మూలించండి. ఖరీదు రు. 157-15. ట్రయల్ 12-13.

**చెవుడు** పూర్తి కోర్సుద్వారా చెవుడు పూర్తిగా నయముగును. పూర్తి కోర్సు రు. 147-15. ట్రయల్ రు 17-97 న.పై.

**కంటిలోని పొర** పక్వమైనా, కాకపోయినా, ఆపరేషన్ లేకుండా రు. 87 97 న.పై.లకు తప్పక నయం చేయబడును.

జాబులు ఇంగ్లీషులో వ్రాయండి.

**DR. SHERMAN, F.C.S.**
**181, R. N. Guha Road, Calcutta-28.**

**డాక్టర్ వృత్తి చేయండి!**



ఇంటిలో విరామంగా కూర్చొని ఉండేప్పుడు పోస్టల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదవు కొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజి ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

**INDIAN HOMOEOPATHIC COLLEGE**
**(A.W.P.) JULLUNDUR CITY**

**పొడగరి అంటే ప్రతివారికీ ఇష్టం**

**పొడుగుగా ఉండండి**

ఈ పుస్తకంలో ఇవ్వబడిన వికిరి రహస్యమైన, శాస్త్రీయమైన పద్ధతుల సహాయంతో మీ ఎత్తును 6 అంగుళాల వరకు పెంచుకొనండి. వయోనిబంధన ఏమీ లేదు. ఇది ఒక అమెరికన్ ప్రచురణ వెల: రు. 8 50. పోస్టేజి 1/50.

**RAJA TRADERS (A.P.W)**
**Lajpat MKt, P. Box 1494, DELHI.**

దిట్టా? పోనీ, ఇకముందు ఇక్కడికెవర్నీ తీసుకురాను. సరా? మొదట్లో అనుకొన్న ప్రకారమే అయితే, వారంరోజుల్లో మకాం ఎత్తి పెట్టెయ్యవలసిందే. కాని, కొన్ని కొన్ని అనుకోని గొడవలొచ్చి పడ్డాయి. ఇన్నాళ్లు భరించేవు. మరొక్క పది పదిహేను రోజుల్లో అంతా సెటిలయిపోతుంది. నీకు నష్టం లేకుండా చూస్తాను."

"నాకేం తేరగా డబ్బక్కర్లేదు. మనిషేమయినా ఇబ్బందుల్లో ఉంటే కొంతకాలం నాదగ్గరున్నందువల్ల నాకేం కష్టం లేదుగాని, ఈ ఇల్లు ఒక జూదాలశాల, పానశాల మాత్రం చెయ్యకుండా ఉండాలి. లేదంటే నేనే స్వయంగా పోలీసులకి..."

"అంతపని మాత్రం చెయ్యకు—నీకు పుణ్యం ఉంటుంది. ఇక్కడ మరి ఆడములే. ఇంకెంత, మరొక్క వారం, పదిరోజులు— తరవాత నీకే గొడవా ఉండదు. సరేనా?"

"సరే, చూద్దాము. నీమాటమీద నువ్వు నిలబడాలి."

• • •

"ఈరోజున మన ముఠా మరొకచోటికి మకాం మార్చినట్టుంది?"

"ఏం మార్చడమో! మీరు మొదట అంత గట్టిగా చెప్పి, కొసకి మెత్తబడిపోయారు."

## కొండల్రావు

"ఏం చెయ్యను? చూస్తూ చూస్తూ కచ్చితంగా 'వెళ్లిపో' అని అనలేకపోయాను. ఇంతకీ మరొక పది పదిహేను రోజుల్లో అంతా తేలిపోతుందిటకదా!"

"ఏం తేలడమో, మునగడమో! ఎవళ్ల గొడవ వాళ్లు పడితే బాధలేదు."

"ఒక్క మాటడుగుతాను, మీకు కోపం రాదంటే......"

"నాకు కోపమా? ఎందుకు? అడగండి."

"మీకూ, ఈ గోపాలానికీ ఎలా స్నేహం కలిసింది అని. నేనేమో మొదట్లో మీరు....."

"అతని భార్యననుకొన్నారు. అంతేనా? ఆవిధంగా గుర్తించబడే అదృష్టం నాకులేదు. నాపూర్వ చరిత్ర, వీళ్లతో ఎలా సంబంధం కలిసింది—అదంతా చెప్పాలనే ఉంది. కాని, చెప్పి ప్రయోజనం లేదు—మీమనసు పాడవడం తప్ప."

"నామాటకేంగాని, మీకు చెప్పాలని లేకపోతే చెప్పకండి."

"నేను వీళ్లకి అందకుండా ఒక్కతెనూ

నల్లమలదారి

ఫోటో—'భరద్వాజ' (మద్రాసు-18)



ఎక్కడైనా పోవాలని ఈమధ్యన చాలామార్లు అనుకొన్నాను. కాని, లాభం లేదు. తప్పించుకొని నేను ఏంచేసినా, చెయ్యకపోయినా నావల్ల తమకేం ప్రమాదం వస్తుందోనని నన్ను బతకనివ్వరు వీళ్లు."

"అంతటి చిక్కు పరిస్థితి అన్నమాట?"

"ఏంచేస్తాం? ఎవరి కర్మకు ఎవరు కర్తలు?"

"పోనిండి. మీ పరిస్థితులు, చిక్కులు, రహస్యాలు అవేవీ నాకు చెప్పక్కర్లేదు. కాని, ఏదైనా ఫలానా అని స్పష్టంగా భయం ఉంటే, నేను చెయ్యగలిగిన సహాయం ఏమయినా ఉంటుందంటే మాత్రం సంశయించకండి."

"ఆమాత్రం భరోసా ఇచ్చినందుకు భగవంతుడు మీకు మేలుచేస్తాడు. కాని, ఏంలేదు. ఇప్పుడు నాకోరిక మరేం లేదు. మా గొడవలు మాకు ఎటూ తప్పవు. కాని, మీకవి ఎంతవేగం వదిలిపోతే అంత మంచిదని. మాటల్లోపడి మీకు కాఫీ ఇవ్వడం సంగతే మరిచిపోయాను."

• • •

"అయ్యా ఇన్‌స్పెక్టరుగారూ! మీరెన్ని మార్లు ఎంత తరిచి తరిచి అడిగినా, నేను చెప్పగలిగింది మరేం ఎక్కువ లేదు.

"గోపాలం నా చిన్ననాటి స్నేహితుడు. వాళ్ల పెద్దనాన్నగారు దిక్కులేని నన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారు. అప్పుడు ఏదో కారణంగా నన్ను వాళ్లింట్లోంచి తరిమేశారు. తరవాత, సుమారు ఈ పదేళ్లుగా నేను ఈ సైకిలుషాపు పని చూసుకుంటూనే ఉన్నాను. వాడిసంగతా? అదే చెప్తున్నాను. ఈ మధ్యని ఒకనాడు వచ్చి, ఏదో చిక్కులో ఉన్నాననీ, కొన్నాళ్లపాటు నాతో ఉంటాననీ అంటే ఉండమన్నాను. అంతకంటే గోపాలం గురించిగాని, వాడి స్నేహితుల గురించిగాని, అధమం వాళ్ల పేర్లయినా నాకు తెలియవు. నా యింట్లో వాళ్ల ఆటపాటలూ, వినోదాలూ చూసి కచ్చితంగా వెళ్లిపొమ్మని చెప్పేను. ఇదుగో అదుగో అంటూనే గడిపాడు.

"ఆరోజు సాయంత్రం నేనింటికి వచ్చేసరికి ఆవిడ శకుంతల ఎటో జోరుగా వీధిలో పరుగెడుతూంది. ఇంట్లో తుపాకి పేలిన శబ్దం వినిపించింది. నేను పెరట్లోకి వెళ్ళేసరికి గోపాలం పారిపోతున్నాడు పెరటివైపు. అతన్ని ఆగమంటూ నేను వెళ్తుండగా వెనకనుంచి తుపాకి పేలింది. దెబ్బ నాకు తగిలింది. గోపాలం పారిపోయాడు గోడదాటి. వెనకనుండి కాల్చిన మనిషి కుప్పగా కూలిపోయాడు. ఆ తరవాత నాకు మతిపోయినట్టయింది. తక్కినది నాకంటె మీకే బాగా తెలుసును.

"అయ్యా, నాకు తెలిసిందింతే. నేను చచ్చినా, బతికినా కావలసిన వాళ్లెవరూ లేరు. నాకు దాచవలసిందికూడా ఏమీలేదు. అబ్బ, బాధ! ఆ చావయినా వేగం వస్తే బాగుండును."

"నీ ప్రాణానికేం భయంలేదయ్యా—డాక్టరు చెప్పాడు. కాని, తెలిసిన నిజం మాత్రం దాచే

వంటే చిక్కే. చూసుకో."

• • •

"రోజూ నాకు భోజనం తేవడం—మీకు ఇదొక శ్రమ."

"అంతకంటె ఇప్పుడు నాకున్న పనేమిటి? ఇంక రెండు రోజుల్లో ఇంటికి వెళ్ళవచ్చునని డాక్టరుగారు చెప్పారు."

"పదిరోజులకింకట ఇన్‌స్పెక్టరుగారన్న మాటలు వింటే ఈ గొడవ ఇంతవేగం ముగు స్తుందనుకోలేదు."

"నేనూ అనుకోలేదు. మరి తప్పించుకొందికి పిల్లేని సందర్భంలో గోపాలం పోలీసులమీదికి తుపాకీ పేల్చాడు. వాళ్ళూరుకొంటారా? మరణ వాఙ్మూలంలో అంతా స్పష్టంగా తన నేరం ఒప్పు కోవడమే కాకుండా మిమ్మల్ని, నన్ను బయట పెట్టాడు. ఇంక మనకి ఆ గొడవ ఏమీలేనట్టే. కాని, మీకింకా చేతికి బలం రావడానికి ఎన్నాళ్ళు పడుతుందో?"

"ఎన్నాళ్ళు పట్టినా బాధలేదు. ఆ ధర్మా త్ముడు కొంతకాలం పాటు కావాలంటే కూర్చుని తినడానికి తగిన ఏర్పాటుచేసి మరీపోయాడు."

"మీరు ఇంటికి వచ్చిన తరవాత మీతాళ్ళు, మీ సామగ్రి అన్నీ అప్పజెప్పి వెళ్ళిపోవాలను కొంటున్నాను."

"ఎక్కడికి?"

"ఎక్కడినుండి వచ్చేనో అక్కడికే. విశాల ప్రపంచం అంతా నాదే. తమది అని ఎంతో కొంత ఉన్నవాళ్ళకే ఒకచోట కట్టుబడి ఉండ వలసిన అవసరం కాని......"

"ఆఁ ఏమన్నారు? సరే. అన్నీ నాకు అప్పజెప్పి మరీ వెళ్తానన్నారు కదా? ఫర్వాలేదు."

• • •

"మీకేమిటో వెలగాటం లావుంది."

"వెలగాటమా?"

"కాకపోతే మరేమిటి? ఆరోజు నేను వెళ్ళి పోతానంటే కొత్తబట్టలు, పెట్టె కొనిఇచ్చేరు. తక్కిన ఏర్పాట్లన్నీ చేసేరు. చివరిక్షణంలో నా చేతిలో ఒక చీటీ ముక్క ఉంచేరు."

"ఏం చెయ్యను? నోటితో చెప్పలేకపోయింది, రాసి ఇచ్చేను."

"గడుసువారే. ఈ ఇంట్లో అన్ని సామాన్లూ సరిగానే అప్పజెప్పేరు కాని, నా హృదయం అది నానుండి దూరంగా తీసుకుపోతే ఎలా? అని రాసేరు."

"తప్పా?"

"తప్పనుకుంటే ఎందుకుంటాను? కాని, ఇప్పుడీ తతంగమంటేనే నాకు ఏమిటోలాగుంది. మీకు నావల్ల కావలసిన ఏ సేవలకు లోటవు తుందని?"

"నేను నాగురించి, మీగురించి మాత్రమే ఆలోచించడం లేదు. ముందుకి పిల్లంటే వాడు తల్లి, తండ్రి ఫలానావాని చెప్పుకొనేహక్కుండాలి."

"ఆమాట నిజమేననుకోండి. కాని, గతంలోని నా చరిత్ర అంతా ఎన్నిసార్లు చెప్పబోయినా మీరు చెప్పనివ్వలేదు."

"అదంతా తుడిచివెయ్యాలనే కదూ నాబాధ? మీరు అనుకొన్నంత పెద్ద తతంగం ఏమీ లేకుండా రిజిస్ట్రేషను అతి సులభంగా కొద్ది సేపట్లో జరిగిపోతుంది."

"సరే. మీ ఇష్టం."

"అంటే మీ కిష్టం లేదా?"

"లేకుంటే నన్ను బలవంత పెట్టేదెవరు? ఇప్పటివరకు పర్వస్వతంత్రురాల్ని."

"ఆ స్వాతంత్ర్యం పోతుందేమోనన్న భయం ఉంటే, మరి కొన్నాళ్ళు ఆలోచించండి."

"ఇంకా ఆలోచించేదేముంది? గోపాలం తెలిసో, తెలియకో చేసిన మంచిపని ఇది ఒక్కటే— నన్నిక్కడికి తీసుకొనిరావడం."

"ఏడుస్తున్నారా? ఆదంతా ఒక పీడకల. అది మరిచిపోడానికే......"

"లేదు, నవ్వుతున్నాను. మరెందుకాలస్యం? పదండి. ఊం ఎందుకు నవ్వు వచ్చిందో చెప్పనా? ఇంక మరెందుకేమి—అటు రిజిస్ట్రారు ఆఫీసు నుండి తిరిగి వచ్చేవరకే కదా మీరిలా 'ఏమండీ, మీరు' అంటూ పిలవడం. ఆ తరవాత 'ఏమేవ్, ఒసే, ఒప్పనా' అంటూ......"

"అలా పిలుస్తానని భయమా? లేదు, ఇప్పటిలాగే పిలుస్తాను."

"అపచారం చెయ్యకండి మీకు పుణ్యం— ఉంటుంది. రేపొద్దున్న పిల్లలముందు కూడా అలాగే పిలుస్తారు కాబోలు!"

"ఏం తప్పా?"

"తప్పు కాకపోతే సరా? నాకు వింటానికి బాగుండదు. నాపేరు మీకు వచ్చకపోతే చెప్పండి, ఇప్పుడే మార్చేద్దాము."

"ఆదేమిటి శకుంతలా! అలా అంటావు?"

"సరిగా నాకు కావలసింది అదే. అలాగే పిల వండి చాలు. సాయంత్రం సినిమాకి వెళ్దామను కొన్నాం. తెల్లవారుజాము రైల్లో ఈరోజే తిరుపతి ప్రయాణం అంటున్నారు."

"ఏం, నీకిష్టం లేదా?"

"నా ఇష్టం వల్ల నేనిన్నాళ్ళూ సుఖపడలేదు. ఇకముందు అన్నింటిలోనూ మీ ఇష్టమే. ఏమంటి?"

"బాగుంది—ఎవళ్ళయినా ఉన్నప్పుడు బాధ లేదు గాని, మనం వేరే ఉన్నప్పుడు ఇలా 'అండీ, మండీ' అనేకంటే నన్ను 'కొండా' అంటేనే నాకు బాగుంటుంది."

"నావల్ల కాదు బాబూ!"

"అయితే ఇకను నా ఇష్టమేముంది?"

"అప్పుడే అలకా? ఇలా దగ్గరసా రండి. చెవిలో అంటాను."

"చెవిలో చెప్పే ఏకాంతాలకి పిలుపెందుకు? అసలు ఆలస్యం అయిపోతున్నది, శకుంతలా దేవిగారూ!"

"నేను సిద్ధం— తమదే ఆలస్యమండీ. శ్రీశ్రీ శ్రీ కొండల్రావుగారూ."

★



మధు కలశం

చిత్రం — బి. శశి ([illegible])